సాక్షి రంగారెడ్డి

బుధవారం ׀ 18 ׀ అక్టోబర్ ׀ 2023



కాంగ్రెస్‌కు అండగా నిలవండి

కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని, పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 10లో▸



చీరలు స్వాధీనం

గండిపేట చౌరస్తా వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో కారులో తరలిస్తున్న చీరలను స్వాధీనం చేసుకున్నారు. 10లో▸



కత్తితో గొంతు కోసి

భార్య తలపై రోకలిబండతో మోది.. కత్తితో గొంతు కోసి హత్యచేసిన భర్త.. తానూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. 10లో▸

న్యూస్‌రీల్

'గ్యారెంటీ'గా అమలు చేస్తాం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి



ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర ప్రగతి, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసమే సోనియాగాంధీ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రకటించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని లక్ష్మీనరసింహకాలనీ, దాసరి నారాయణకాలనీ, న్యూ కమలానగర్ కాలనీల్లో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆరు స్కీముల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యమని, ప్రజలంతా ఆలోచించి వచ్చే ఎన్నికల్లో హస్తం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు గంగమ్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై అంతర్జాతీయ సదస్సు



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

మొయినాబాద్‌రూరల్: సాంకేతిక టెక్నో ఆవిష్కరణలు, టెక్నో టెన్యూర్‌షిప్ మేధోసంపత్తి హక్కులపై కేఎల్ యూనివర్సిటీలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం గర్వించదగ్గ విషయమని కేఎల్ యూనివర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ అన్నారు. అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన సదస్సుకు సత్యనారాయణతోపాటు జపాన్ దేశానికి సంబంధించిన ఎగ్జామినేషన్ పాలసీ ప్లానింగ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ డిప్యూటీ డైరెక్టర్ ఇరోకి వటనాబే, ఏపీ చాంబర్‌ఆఫ్ కామర్స్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ అధ్యక్షుడు సీహెచ్‌ఆర్‌వో పొట్లూరి భాస్కర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యాపార నిపుణులు, న్యాయనిపుణుల మధ్య సంభాషణ.. సహకారాన్ని పెంపొందించడానికి ఈ సదస్సు ఒక ప్రత్యేకమైన వేదిక అని పేర్కొన్నారు. సాంకేతిక ఆవిష్కరణలు, మేధోసంపత్తి, హక్కుల రంగాల్లో కీలకమైన అంశాలను చర్చించడానికి ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యావేత్తలు, అనుభవజ్ఞులైన నిపుణులు రావడం అభినందనీయమన్నారు. అనంతరం సదస్సుకు హాజరైన అతిథులను ఘనంగా సన్మానించారు.

గ్యాస్‌కు అధికంగా వసూలు చేస్తే జైలే

పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్



కందుకూరు: గ్యాస్‌ను ఇవ్వాల్సిన గడువులోగా ఇవ్వకుండా.. ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే జైలే అని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. కందుకూరులో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై ఉన్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల గురించి వాకబు చేశారు. స్థానిక ఏజెన్సీలో ఎప్పటి నుంచి కాల్స్ పెండింగ్‌లో ఉన్నాయి? ఎంత మందికి రీఫిల్స్ సరఫరా చేశారు? రసీదు ఇస్తున్నారా, లేదా? అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ సిలిండర్లకు డెలివరీ బాయ్‌లు అధికంగా వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయని ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. నిర్దేశిత ధర కంటే అధికంగా తీసుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కల్వకుర్తి డీఎస్పీ అభ్యర్థిగా రమేశ్

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) అభ్యర్థిగా నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జెపల్లి గ్రామానికి చెందిన వంకేశ్వరం రమేశ్‌ను పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ప్రకటించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ.. డీఎస్పీ విజయం కోసం సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాకేశ్, బాల్‌రాం, రాజు, వెంకటేశ్, జగన్ పాల్గొన్నారు.

కారులో లుకలుక కాంగ్రెస్‌లో చేరిక



అధికార పార్టీని వీడుతున్న అసంతృప్తులు

- హస్తం గూటికి చేరుతున్న ఆశావహులు
- వెంట ద్వితీయశ్రేణి నాయకులు సైతం..
- తాజాగా చేవెళ్లలో రత్నం తిరుగుబావుటా
- స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటన
- బీఆర్‌ఎస్‌కు తప్పని తలపోటు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్దీ అధికార పార్టీలో లుకలుకలు ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. ఇప్పటి నేతల మధ్య అంతర్గతంగా ఉన్న విభేదాలు ఎన్నికల వేళ బహిర్గతమవుతున్నాయి. ముఖ్యమైన నేతలు, ఆశావహులు ఒక్కరొక్కరు కారు దిగి.. హస్తం గూటికి చేరుతున్నారు. వలసలను నియంత్రించేందుకు కీలక నేతల నేతృత్వంలోని కమిటీ యత్నించినా అడ్డుకట్ట పడడం లేదు. ఎన్నికల్లో సిట్టింగ్ అభ్యర్థుల గెలుపుపై ప్రభావం చూపనుండడంతో ఏం చేయాలో అర్థం కాక అధిష్టానం తలపట్టుకోవాల్సి వస్తోంది. తాజాగా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం విలేకరుల సమావేశంలో ఇదే అంశాన్ని స్పష్టం చేశారు.

షాద్‌నగర్‌లో..

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సహా ఫరూఖ్‌నగర్, కేశంపేట జెడ్పీటీసీలు వెంకట్రామిరెడ్డి, తాండ్ర విశాల, కొత్తూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాం సుందర్‌రెడ్డి, మైనార్టీ నేత జమృత్‌ఖాన్ పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వీరంతా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిశారు. ఒకటి రెండు రోజుల్లో ఆ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. మంగళవారం నియోజకవర్గానికి చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గంలోని కీలక నేతలంతా పార్టీని వీడనుండటం అధికారపార్టీకి కోలుకోలేని దెబ్బ.

కల్వకుర్తిలో..

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి నుంచి టికెట్ ఆశించారు. అధిష్టానం సిట్టింగ్ అభ్యర్థికే మళ్లీ టికెట్ కేటాయించడంతో ఇటీవల ఆయన హస్తం పార్టీలో చేరారు. ఆయనతో పాటు ఇద్దరు ఎంపీపీలు, పలువురు సర్పంచులు, వార్డు మెంబర్లు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల విడుదల చేసిన తొలి జాబితాలో ఆయన పేరు కూడా ఉండటం విశేషం. కసిరెడ్డి పార్టీ వీడటంతో నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్‌కు గట్టి పోటీ ఎదురుకానుంది.

మహేశ్వరంలో..

ఇప్పటికే ఆ పార్టీ సీనియర్ నేత కొత్త మనోహర్‌రెడ్డి సహా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి అధికార బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరిలో కొత్త కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురై.. ప్రస్తుతం స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే తీగల సైతం పార్టీని వీడనున్నారనే ప్రచారం జరిగింది. అధిష్టానం బుజ్జగింపులతో తాత్కాలికంగా ఆయన ఆగిపోయారు.

శేరిలింగంపల్లిలో..

మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ సహా ఆయన సతీమణి హాఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత రెండు రోజుల క్రితమే అధికార పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. తాజాగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరి వెంట మరో పది మంది ముఖ్య నేతలు ఉన్నారు. సంస్థాగతంగా వీరికి మంచి పట్టుంది. కాంగ్రెస్ నుంచి వీరికి అవకాశం లభించినట్లు ప్రచారం జరుగుతోంది. దంపతులిద్దరూ పార్టీని వీడటం అధికార పార్టీకి పెద్ద మైనస్‌గా భావిస్తున్నారు.

ఎల్‌బీ నగర్‌లో..

బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ సహా ఆయన సతీమణి బీఎన్ రెడ్డి కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అధికార పార్టీకి పెద్ద షాక్ ఇచ్చారు. మరి కొంతమంది మాజీ కార్పొరేటర్లు సైతం వారి బాటలోనే నడవనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

హక్కే కాదు.. బాధ్యత కూడా



- ఓటు హక్కును వినియోగించుకోవాలి
- అర్బన్‌లో ఓటింగ్ శాతం పెంపే లక్ష్యం
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించం
- అలాంటి అధికారులపై చర్యలు తప్పవు
- 'సాక్షి'తో కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఎన్నికల రోజు క్యూలైన్‌లో నిలబడటం ఇష్టం లేక కొంత మంది.. తానొక్కడిని ఓటు వేయకపోతే ఏమవుతుంది అనే భావనతో మరికొంత మంది పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉంటున్నారు. ఓటు హక్కు మాత్రమే కాదు.. బాధ్యత కూడా. ప్రతి ఓటరు విధిగా తన హక్కును వినియోగించుకోవాలి' అని కలెక్టర్ భారతి హోళికేరి అభిప్రాయపడ్డారు. మంగళవారం 'సాక్షి'తో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్నికల వ్యవస్థపై అవగాహన ఉన్న, విజ్ఞత కలిగిన ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోకపోవడం ద్వారా సమాజానికి నష్టం జరుగుతుందన్నారు. ఓటుహక్కు.. ఓటింగ్ ఏర్పాట్లు.. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఆమె మాటల్లోనే..

ముందున్న కర్తవ్యం ఇదే

జిల్లాలో 3,369 పోలింగ్ బూతులు ఎంపిక చేశాం. వీటిలో 1,206 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్లు ఇప్పటికే గుర్తించాం. వీటిలో పది అతి క్లిష్టమైన కేంద్రాలు ఉన్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆయా పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఓటర్లు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే స్వేచ్ఛాయుతవాతావరణం కల్పిస్తాం. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తాం. ప్రత్యక్ష దాడులు, బెదిరింపులకు పాల్పడే వ్యక్తులను గుర్తించి, ఇప్పటికే వారిని బైండోవర్ చేశాం. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం నా కర్తవ్యం. ఇందుకు అడ్డుతగిలే వారెంతటి వారైనా ఉపేక్షించం. అలాంటి శక్తులను అణిచి వేసేందుకు వెనుకాడబోం. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించం. ఏ ఒక్క పార్టీకి కొమ్ము కాయబోం. ప్రచార సభలకు అనుమతులు, పోలింగ్ కేంద్రాల్లో అన్ని పార్టీలకు సమ ప్రాధాన్యం ఇస్తాం.

కౌంటింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు

తెలంగాణలోనే అత్యధిక ఓటర్లు శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉన్నారు. ఓటింగ్ యంత్రాల నిల్వ, పంపిణీ, బ్యాలెట్ బాక్సులను భద్రపరచడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియాన్ని ఎంపిక చేశాం. కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు మంగల్‌పల్లిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీని ఎంపిక చేశాం. ఎల్బీనగర్ కోసం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం.. షాద్‌నగర్, రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు మరో కౌంటింగ్ కేంద్రాన్ని ఫైనల్ చేయాల్సి ఉంది. ఇప్పటికే చేవెళ్ల సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీని ఎంపిక చేసి, ఎన్నికల కమిషన్ అనుమతి కోసం పంపాం. అనుమతి రాగానే.. అక్కడ కూడా ఏర్పాట్లు చేస్తాం. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు సహా అస్వస్థతకు గురయ్యే ఓటర్లకు తక్షణమే వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నాం.

నామోషీగా అనుకోవద్దు

గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ విషయంలో పెద్ద సమస్య లేదు. రైతులు, కూలీలు, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు తమ బాధ్యతగా భావిస్తుంటారు. చదువుకున్న వారు, ఉద్యోగస్తులు, వ్యాపారులు ఎక్కువగా ఉండే అర్బన్ ప్రాంతాల్లోనే అసలు సమస్య. ఆర్థికంగా ఉన్నత హోదాల్లో ఉన్న వారు, ఇతర వీఐపీలు ఎన్నికల రోజు పోలింగ్ బూత్‌కు వచ్చి సాధారణ ఓటర్ల మధ్యన క్యూలైన్‌లో నిలబడేందుకు నామోషీగా ఫీలవుతుంటారు. ఓటు హక్కును సాధించడంలో కనబరిచిన శ్రద్ధ .. వినియోగించుకునే విషయంలో చూపించడం లేదు. సమాజం, రాజకీయాలపై అంతా ఇంతో అవగాహన ఉన్న వాళ్లు కూడా ఓటు హక్కును వినియోగించుకోకపోవడం బాధాకరం. అలా వినియోగించుకోని పక్షంలో సేవకులు కాకుండా స్వార్థపరులు, అవినీతిపరులు, ఇతర అసాంఘిక శక్తులు చట్ట సభల్లోకి వస్తారు. వీరి ద్వారా సమాజానికి కీడే ఎక్కువ జరుగుతుంది. ఆ తర్వాత బాధ పడినా ఫలితం ఉండదు.

న్యాయం చేయకపోతే పోటీ చేస్తాం

- శంకర్ హిల్స్ ప్లాట్స్ పర్చేసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కాచిగూడ: తమ ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం న్యాయం చేయకపోతే త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెయ్యి మంది సభ్యులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగుతామని శంకర్ హిల్స్ ప్లాట్స్ పర్చేసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు సువర్ణ రెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1983లో గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని 460 ఎకరాల్లో 3,328 ప్లాట్లను కొనుగోలు చేసిన వారిని సైట్ మీదకు రానివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న జైహింద్ రెడ్డి, అతని అనుచరులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్కరు 500 గజాలతో కొనుగోలు చేసిన ప్లాట్లను కొందరు ప్రభుత్వ పెద్దల అండతో వ్యవసాయ భూమిగా చిత్రీకరించి.. విద్యుత్ పర్మిషన్ తీసుకొని కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్లాట్లవద్దకు వస్తే కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమ ప్లాట్లు తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. తమకు జరుగుతున్న అన్యాయంపై త్వరలోనే గవర్నర్, ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్ నమోదు కేంద్రం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా సంక్షేమ అధికారి పద్మజారమణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని మహిళా సాధికారత కేంద్రంలో మంగళవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, లింగమార్పిడి, వయో వృద్ధులకు ఓటరు గుర్తింపుకార్డు, ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్ నమోదు కేంద్రం శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి బి.పద్మజారమణి మాట్లాడుతూ.. శిబిరాన్ని బుధవారం కూడా కొనసాగించనున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు లింగమార్పిడికి సంబంధించి 150 మంది పాల్గొనగా, 91 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ వినీతాదేవి, క్వీర్‌బంధు పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి ముకుందమాల, జిల్లా న్యాయ సలహాదారు విజయభాస్కర్, సఖి ఇన్‌చార్జి మంజుల పాల్గొన్నారు.

'వర్గీకరణ'తోనే మాదిగలకు న్యాయం

తలకొండపల్లి: ఏబీసీడీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మహాజన నేత మందకృష్ణ మాదిగ అన్నారు. ఆయన చేపట్టి విశ్వరూప మహా పాదయాత్ర మంగళవారం రెండో రోజు మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వ మాట తప్పిందని విమర్శించారు. అన్ని పార్టీలు మాదిగలను మోసం చేశాయని దుయ్యబట్టారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే పాదయాత్ర చేపట్టామని, ఇకనైనా వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, మాజీ సర్పంచ్ మల్లమ్మ, టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, పూలే అంబేడ్కర్ జాతర జిల్లా అధ్యక్షుడు దర్పుల శంకర్, జిల్లా నాయకుడు కృష్ణ, మండలాధ్యక్షుడు కిరణ్‌పూలే తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

ఎన్‌ఐఆర్‌డీ మాజీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ రాంపుల్లారెడ్డి



మాట్లాడుతున్న రాంపుల్లారెడ్డి

కడ్తాల్: మారుమూల ప్రాంత విద్యార్థులు విద్యను అభ్యసించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎన్‌ఐఆర్‌డీ మాజీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ డబ్ల్యూ.రాంపుల్లారెడ్డి అన్నారు. అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో మూడు రోజుల పాటు కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్, ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఉదాత్త జీవితం- ఉన్నత లక్ష్యం, సామాజిక బాధ్యత-మానవీయ విలువలు, నేచర్ వాక్, ఆరోగ్యం- ఆహారం, విలువల బడి-సామాజిక ఆవశ్యకత, పిల్లల సంరక్షణ- తల్లిదండ్రుల బాధ్యత, జీవన విద్య తదితర అంశాలపై విలువల బడి ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారం సాయంత్రం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ విద్యార్థులు చదువుకు దూరం కావడానికి తల్లిదండ్రులు, సామాజిక పరిస్థితులే కారణమన్నారు. ఇలాంటి పరిస్థితులను దూరం చేయాలంటే సేవా దృక్పథం ఉన్న సామాజిక వేత్తలతో పాటు, ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంత విద్యార్థులు విద్యనభ్యసించేలా ప్రోత్సహించాలని కోరారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్తున్న ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్కే లెనిన్‌బాబును వివిధ రంగాలకు చెందిన నిపుణులు, పలువురు వక్తలు అభినందించారు. సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, సీజీఆర్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, ఇంజనీరింగ్ నిపుణుడు సురేందర్‌రెడ్డి, రవికాంత్, వనం ప్రసాద్, వందేమాతరం రవీంద్ర తదితరులు ఉదాత్త జీవితం, ఉన్నత లక్ష్యం, సామాజిక బాధ్యత, మానవీయ విలువలు, నేచర్ వాక్, ఆరోగ్యం ఆహారం, విలువల బడి, సామాజిక ఆవశ్యకత, పిల్లల సంరక్షణ, తల్లిదండ్రుల బాధ్యత, జీవన విద్య తదితర అంశాలపై వివరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. సాయిభాస్కర్‌రెడ్డి, ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సోమలింగ, రఘువీర్, దిలీప్, సీజీఆర్ సిబ్బంది, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలపై నిఘా



బ్యాంకు అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హోళికేరి

బ్యాంకు అధికారుల సమావేశంలో కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల నేపథ్యంలో ప్రతి బ్యాంకు ఖాతాపై నిఘా పెట్టాలని కలెక్టర్ భారతి హోళికేరి సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం వివిధ బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల ఖాతాలే కాకుండా సామాన్యుల ఖాతాలపై కూడా నిఘా పెట్టాలన్నారు. అనుమానాస్పదంగా, అసాధారణంగా రెండు, మూడు నెలల నుంచి నగదు జమ/తీసుకోవడం లేని బ్యాంకు ఖాతాలో రూ.లక్ష, అంతకు మించి నగదు జమ చేయడం, తీసుకోవడం జరిగితే సంబంధిత ఖాతా వివరాలు జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలని సూచించారు. ఒక ఖాతా నుంచి ఎక్కువ ఖాతాలకు నగదు బదిలీ చేసినా, చాలా ఖాతాల నుంచి ఒకే ఖాతాకు బదిలీ అయినా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

ఆధారాలు చూపాల్సిందే..

సాధారణ ప్రజలు తమ బ్యాంకు ఖాతాలో రూ.10 లక్షలు, అంతకు మించి నగదు జమ చేసిన, తీసుకున్న వివరాలను సంబంధిత శాఖ నోడల్ అధికారికి తెలియజేయాలని అన్నారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేకంగా ఖాతా తెరవాలని తెలిపారు. చెక్, ఆర్టీజీఎస్, నెఫ్ట్ ద్వారా బదిలీ చేసుకోవచ్చన్నారు. సామాన్య ప్రజలు రూ.50 వేలకు మించి నగదును తమ వెంట తీసుకెళ్లరాదని, అత్యవసర పరిస్థితిలో తీసుకెళ్తే సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఎన్నికల అధికారులు, వివిధ బ్యాంక్ల మేనేజర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ భారతి హోళికేరి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సెక్టోరియల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, భద్రతా సిబ్బంది, ఉద్యోగులకు అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా, ర్యాంపులు, ఫర్నిచర్, టాయిలెట్స్ వసతులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఏ పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి వసతులకు ఆస్కారం ఉందో నివేదికలు సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, ఆర్డీఓలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దు

ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులు నిర్వర్తించాలని కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈవీఎంలు, వీవీ పాట్ల కంట్రోల్ యూనిట్లపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

రోకలిబండతో మోది.. కత్తితో గొంతు కోసి

- భార్యను హత్య చేసిన భర్త
- భవనంపై నుంచి దూకి తానూ ఆత్మహత్య
- కుటుంబ కలహాలే కారణం

నాగోలు: భార్య తలపై రోకలిబండతో మోది.. కత్తితో గొంతు కోసి హత్యచేసిన భర్త.. తానూ బలవన్మరణానికి పాల్పడిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన తెలగమల్ల రాజు (45)కు, కందుకూరు మండలం ముచ్చర్లకు చెందిన పర్సన్ కృష్ణమ్మ కూతురు సంతోషి (40) తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ కుటుంబం నగరానికి వచ్చి నాగోలు సాయినగర్ కాలనీలో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తోంది. వీరి కుమార్తె సింధుజ ఇంటర్ మొదటి సంవత్సరం, కుమారుడు సాయిరాం 9వ తరగతి చదువుతున్నారు. రాజు సొంతంగా లారీ కొనుగోలు చేసి నడుపుతున్నాడు. వచ్చిన డబ్బుతో జల్సా చేసేవాడు. సంతోషి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో కొంత కాలంగా ఆయాగా పని చేస్తోంది. రాజు, సంతోషి మధ్య కొన్నేళ్లుగా మనస్పర్థలు కొనసాగుతున్నాయి. ఇరువురి మధ్య తగాదాలు ఘర్షణలు జరుగుతున్నాయి. సంతోషి ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించేవాడని స్థానికులు చెబుతున్నారు.

ఏం జరిగిందంటే..?

సోమవారం సాయంత్రం సరూర్‌గర్ గ్రీన్ పార్క్ కాలనీలో ఉంటున్న రాజు చెల్లెలు మంజుల ఇంటికి కూతురు సింధుజ, కుమారుడు సాయిరాంతో కలిసి వెళ్లారు. అక్కడ రాత్రి భోజనాలు చేసిన అనంతరం భార్యాభర్తలిద్దరూ ద్విచక్ర వాహనంపై సాయినగర్‌లోని తమ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో రాజు, సంతోషి మధ్య ఘర్షణ జరిగింది. రాజు ఆవేశంతో సంతోషిపై ఇంట్లోని రోకలి బండతో మోదాడు. అనంతరం కత్తితో గొంతు కోశాడు. భార్య మృతి చెందిందని నిర్ధారించుకున్న రాజు.. ఇంటికి తాళం రాజు సరూర్‌నగర్‌లోని చెల్లెలు ఇంటికి వెళ్లాడు. అక్కడ భవనం రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం రాజు చనిపోయిన విషయాన్ని చుట్టుపక్కల వారు గమనించి ఆయన చెల్లెలు మంజులకు చెప్పారు. సంతోషికి ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో మృతుడి రాజు బంధువులు సాయినగర్‌కు వచ్చి చూడగా ఇంట్లో రక్తపు మడుగులో ఆమె శవం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు నాగోల్ పోలీసులకు సమాచారం అందించారు. ఒకేరోజు తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో ఇద్దరు పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించాలి



అధికారులు, సిబ్బందితో సమావేశమైన రాజేంద్రనగర్ డీఈ పి.రత్నాకర్ రావు.

రాజేంద్రనగర్: విద్యుత్ వినియోగదారులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే సిబ్బంది స్పందించి పరిష్కరించాలని రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజినీర్ పి.రత్నాకర్ రావు అన్నారు. మంగళవారం శివరాంపల్లిలోని డివిజన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో వినియోగదారులు ఫిర్యాదులకు స్పందించినప్పుడే మంచి పేరు రావడంతో పాటు సేవలు అందించిన వారవుతామన్నారు. సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది సేఫ్టీ పరికరాలను ధరించి పని చేయాలని సూచించారు. కొత్తగా విధుల్లో చేరిన జూనియర్ లైన్‌మెన్‌లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారులు తమ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే ప్రాంతాల వారీగా మొబైల్ నంబర్లు ఇచ్చామని ఆయా నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలు సెక్షన్ అధికారులు, సిబ్బందికి వివరించాలన్నారు. ఈ కింద నంబర్లు ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్‌ఓసీ) కాల్ చేసి తమ సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారని డీఈ తెలిపారు. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు సత్యనారాయణ, ఈశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తికి అసభ్యకర వీడియోకాల్

- డబ్బులివ్వాలని యువతి బెదిరింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

యాచారం: అసభ్యకరంగా వీడియో కాల్ చేసిన ఓ మహిళ తాను పోలీస్ కానిస్టేబుల్‌నంటూ ఓ వ్యక్తిని భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని తక్కళ్లపల్లికి చెందిన తీగల చంద్రశేఖర్‌రెడ్డికి సోమవారం రాత్రి 8:30 గంటల సమయంలో ఓ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. ఇందులో ఓ మహిళా తాను కానిస్టేబుల్‌నంటూ అసభ్యకరంగా వీడియో కాల్ చేసి డబ్బులిస్తావా.. లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలా..? అని బెదిరింపులకు గురిచేసింది. దీంతో ఆందోళనకు గురైన చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉదయం ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేశ్‌తో కలిసి పీఎస్‌కు వెళ్లి సీఐ సైదయ్యకు ఫిర్యాదు చేశారు. సదరు మహిళ కాల్ చేసిన ఫోను నంబరును సీఐకి అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... డబ్బులు లాగడం కోసం ఇలాంటి తప్పుడు ఫోన్ కాల్స్ వస్తుంటాయని, భయపడవద్దని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

యూఎన్ వరల్డ్ ఫోరమ్ సదస్సుకు మేయర్

సాక్షి, సిటీబ్యూరో: యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో నిర్వహిస్తున్న వరల్డ్ ఫోరమ్ సదస్సుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి ఆహ్వానం అందింది. ఈమేరకు ఆమె బుధవారం ఈ సదస్సులో అర్బన్ ఫారెస్ట్రీ అంశంపై ప్రసంగించనున్నారు. ఈ ఫోరమ్‌లో జీహెచ్‌ఎంసీకి ప్రాతినిధ్యం లభించడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు మేయర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం, నగరంలో చేపట్టిన హరితహారం గురించి ప్రముఖంగా ప్రస్తావించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌కు అండగా నిలవండి

- వీర్లపల్లిని గెలిపించండి
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన పలువురు ప్రజాప్రతినిధులు

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్‌లో చేరిన ప్రతీ కార్యకర్త అండగా నిలిచి.. పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సూచించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. హైదరాబాద్ వెళ్లి పార్టీలో చేరిన పలువురికి రేవంత్ కాంగ్రెస్ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తోందన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసమే ఆలోచిస్తుందని తెలిపారు. ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను తీసుకువచ్చామని, అధికారంలోకి వచ్చిన వెంటనే దీన్ని అమలు చేస్తామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో కొత్తూరు మాజీ సర్పంచ్‌లు సుదర్శన్‌గౌడ్, జెనిగ జగన్, మామిడి సిద్దార్థరెడ్డి, మల్లాపూర్ సర్పంచ్ చిర్ర సాయిలు, మధురాపూర్ సర్పంచ్ శివారెడ్డి, రంగంపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, లింగంధన సర్పంచ్ ప్రతాప్, వేముల్‌నర్వ సర్పంచ్ మంజులమల్లేశ్, కాసులాబాద్ సర్పంచ్ గోపాల్, ఎదిర సర్పంచ్ బాల్‌రాజ్, పీర్జాపూర్ సర్పంచ్ రాములు, కొందుర్గు సర్పంచ్ ఆదిలక్ష్మియాదయ్య, రాంచంద్రాపూర్ సర్పంచ్ జహంగీర్, వెంకిర్యాల సర్పంచ్ లింగంగౌడ్, చౌలపల్లి ఉపసర్పంచ్ శ్రీను, సింగిల్‌విండో మాజీ చైర్మన్ చించోడ్ అనంతం, ఇప్పలపల్లి ఎంపీటీసీ మంజులరాజశేఖర్‌గుప్త, మాజీ సర్పంచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ రాములు, కొత్తూరు ఎంపీటీసీ శ్రీను, చౌదరిగూడ మాజీ వైస్ ఎంపీపీ బాబు, మాజీఎంపీటీసీ బస్వరాజ్‌గౌడ్, వార్డు సభ్యులు ప్రభాకర్, రాములు, బాలయ్య, ప్రభాకర్, చంటి, రాఘవేందర్ ఉన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

చోరీలకు పాల్పడుతున్న అన్నదమ్ముల రిమాండ్

రాజేంద్రనగర్: తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అన్నదమ్ములను రాజేంద్రనగర్ సీసీఎస్, శంకర్‌పల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు స్మార్ట్ గడియారాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ జగదీశ్వర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా, కంది మండలం, కవిపేముల గ్రామానికి చెందిన రాజు గౌడ్ పాత నేరస్తుడు. ఇతడిపై 31 కేసులు ఉన్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడేవాడు. జైలు నుంచి బయటికి వచ్చిన రాజు తన సోదరుడు శివ గౌడ్‌తో కలిసి నేరాలను ప్రారంభించాడు. ఈ నెల 12న శంకర్‌పల్లి ప్రాంతంలోని వంశీధర్ రెడ్డి ఇంటి తాళాలను పగలగొట్టి 9.5 తులాల బంగారు అభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పాత నేరస్తుల వివరాలను పరిశీలించగా రాజు గౌడ్, శివ గౌడ్‌లపై అనుమానంతో వారిపై నిఘా పెట్టారు. మంగళవారం మధ్యాహ్నం శంకర్‌పల్లి వద్ద వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో నాలుగు, పటాన్‌చెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వారి నుంచి బైక్, రెండు స్మార్ట్ వాచ్‌లు, 19 తులాల బంగారు ఆభరణాలు, 16 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రాజు గౌడ్‌పై 31, శివ గౌడ్ 7 కేసులు నమోదయ్యాయన్నారు. రాజు గౌడ్‌పై పీడీ యాక్ట్ నమోదుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు డీసీపీ తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన శంకర్‌పల్లి పోలీసులు, రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులను డీసీపీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జగదీశ్వర్ రెడ్డి

యువకుడి నుంచి గంజాయి ప్యాకెట్లు స్వాధీనం

ఆమనగల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఆమనగల్లు పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్టీసీ బస్సులో వస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతనివద్ద ఉన్న సూట్ కేసును తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. లక్షల రూపాయలు విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకుని యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

పోలీసుల తనిఖీలో చీరలు స్వాధీనం



గండిపేట చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

మొయినాబాద్: ఎన్నికల సందర్భంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని గండిపేట చౌరస్తా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా మంగళవారం జేబీఐటీ ఎక్స్‌రోడ్ వద్ద నిర్వహించిన తనిఖీలో ఓ వ్యక్తి కారులో 411 చీరలు పట్టుకున్నారు. వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

వాహనం ఢీకొని మున్సిపల్ కార్మికురాలు మృతి



లావణ్య (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మున్సిపల్ కార్మికురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన పెద్ద లావణ్య(40) కొన్ని సంవత్సరాలుగా మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగంలో కార్మికురాలిగా పని చేస్తుంది. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట విధులు నిర్వహిస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం లావణ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మొయినాబాద్: వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ సమీపంలోని రాధాస్వామి సత్‌సంగ్ వద్ద హైదరాబాద్- బీజాపూర్ రహదారి వెంట మంగళవారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి(45)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని రాచకొండ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.6 లక్షలు విలువ చేసే 50 గ్రాముల ఎండీఎంఏ, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్ రాష్ట్రం డుగోలి గ్రామానికి చెందిన మనోజ్ హైదరాబాద్‌కు వలస వచ్చి, హుస్సేనిఆలం వద్ద నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. మాదక ద్రవ్యాలకు బానిసగా మారాడు. డ్రగ్ పెడ్లర్లతో మంచి సంబంధాలు ఏర్పడటంతో వినియోగదారుడి నుంచి పెడ్లర్‌గా అవతారం ఎత్తాడు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం నేరెడ్‌మెట్ పోలీసు స్టేషన్ పరిధిలోని వాయుపురి బస్ స్టాండ్ వద్ద కస్టమర్‌కు డ్రగ్స్ సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తుండగా..విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ, నేరెడ్‌మెట్ పోలీసులు మనోజ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన పూనమ్ చంద్ పరారీలో ఉన్నాడు.

టన్ను గంజాయి స్వాధీనం

- కర్ణాటక, మహారాష్ట్రలకు రవాణా చేసే ప్రయత్నం
- మల్కనగిరి నుంచి ఖరీదు చేసిన అంతర్రాష్ట్ర ముఠా
- నలుగురు నిందితుల్ని అరెస్టు చేసిన టీఎస్-నాబ్

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్-నాబ్) అధికారులు టన్ను గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ సరుకు ఒడిశాలోని మల్కనగిరి నుంచి హైదరాబాద్ మీదుగా కర్ణాటకలోని బీదర్, మహారాష్ట్ర లోని థానేలకు సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. నలుగురు సభ్యులున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ డి.సునీతరెడ్డి మంగళవారం వెల్లడించారు. బీదర్‌కు చెందిన సకారాం రాథోడ్ 2002లో నగరానికి వలసవచ్చాడు. కొన్నాళ్ళు పానీపూరీ బండి నడిపాడు. ఆదాయం సరిపోకపోవడంతో స్వస్థలానికి వెళ్లి..డ్రగ్ సరఫరాదారుడిగా మారాడు. జన్వాడలో ఉన్న గంజాయి పెడ్లర్స్‌తో సంబంధాలు ఏర్పాటు చేసుకున్న సకారాం గంజాయి దందాలోకి దిగాడు. తన స్నేహితులైన కాశిరామ్, లక్ష్మణ్, రవి సహాయంతో బీదర్‌తో పాటు మహారాష్ట్రకు ఈ దందా విస్తరించాడు. మల్కనగిరి ఏజెన్సీలో ఉన్న గంజాయి విక్రేతలను సంప్రదించిన సకారాం వారి నుంచి నేరుగా ఖరీదు చేయడం మొదలెట్టాడు. మహారాష్ట్రలోని థానేకు చెందిన అజయ్ రమావత్ చౌరాసియా సైతం సకారాంతో చేతులు కలిపాడు. గంజాయి దందా చేస్తున్న సకారాంపై సంగారెడ్డి జిల్లా జోగిపేట, నగరంలోని ఉస్మానియా యూనివర్శిటీ సహా ఐదు ఠాణాలో కేసులు నమోదయ్యాయి. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చిన ఇతగాడు తన సోదరుడు జయదేవ్ చౌహాన్‌తో జట్టు కట్టాడు. ఓ డీసీఎం వ్యాన్ ఖరీదు చేసి తన ప్రాంతానికే చెందిన అహ్మద్ ఖాన్, రాము పవార్‌లను డ్రైవర్, కండక్టర్లుగా నియమించుకున్నాడు. వీరికి అధిక వేతనం ఇస్తూ గంజాయి రవాణా చేయిస్తున్నాడు. తనకు భారీ మొత్తంలో గంజాయి కావాలని ఇటీవల చౌరాసియా నుంచి సకారాంకు ఆర్డర్ వచ్చింది. దీంతో మల్కనగిరికి చెందిన సన్యాసిరావుకు టన్ను గంజాయి కావాలని ఆర్డర్ ఇచ్చిన సకారాం రూ.8 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. పోలీసు నిఘా తప్పించుకోవడానికి వినియోగించే ఉద్దేశంతో 100 ఖాళీ ప్లాస్టిక్ ట్రేలను డీసీఎం వ్యానులో వేసి పంపాడు. మల్కనగిరి వరకు వెళ్ళిన డ్రైవర్, క్లీనర్ టన్ను గంజాయిని ప్యాక్ చేసి, ఈ ట్రేల్లో సర్దుకుని బయలుదేరారు. రాజమహేంద్రవరం ఆటోనగర్ వద్ద కారులో వేచి ఉన్న సకారాం నాలుగు గంజాయి బ్యాగులు డీసీఎం నుంచి తీసి తన వాహనంలో వేసుకున్నాడు. తనిఖీలను గుర్తించి అప్రమత్తం చేయడం కోసం డీసీఎం ముందు ప్రయాణిస్తున్నాడు. సరుకు తీసుకువెల్లడానికి చౌరాసియాను నగరంలోని బొల్లారం ప్రాంతానికి రమ్మని చెప్పారు. ఇదిలా ఉండగా టీఎస్ నాబ్ ఏసీపీ కె.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్లు పి.రాజేష్, జి.గోపాల్, బి.విజయ భాస్కర్‌రెడ్డి, ఎస్సైలు సి.వెంకటేష్ తమ బృందాలతో బోల్లారంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అటుగా వచ్చిన ఈ రెండు వాహనాలు ఆపి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నలుగురినీ అరెస్టు చేసి సరుకుతో సహా స్థానిక పోలీసులకు అప్పగించారు.



'గవర్నమెంట్' స్టిక్కర్‌తో గాంజా తరలింపు!

'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అని బొలెరో వాహనానికి స్టిక్కర్లు తగిలించుకొని హైదరాబాద్ మీదుగా సీలేరు నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితులను రాచకొండ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.24 లక్షలు విలువ చేసే 80 కిలోలు గంజాయి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన కుంచాల శ్రీను హైదరాబాద్‌కు వలస వచ్చి, నాగోల్ బండ్లగూడలో నివాసం ఉంటూ..దినసరి కూలీగా పనిచేస్తూ డ్రగ్స్ పెడ్లర్‌గా మారాడు. ఈక్రమంలో ఆరు నెలల క్రితం పరిచయమైన అనకాపల్లికి చెందిన కల్ల రాముతో జతగట్టి.. ఇద్దరూ కలిసి బొలెరో వాహనంలో విశాఖపట్నంలోని సీలేరు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ధన్‌రాజ్ అనే గంజాయి విక్రేత వద్ద కిలో రూ.4,500 చొప్పున 80 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. సోమవారం సాయంత్రం సీలేరు నుంచి బయలుదేరి తెల్లవారు జామున ఉప్పల్ భగాయత్ మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించగా..విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు ఉప్పల్ వద్ద వీరిని పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

శంషాబాద్: ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం ఉదయం రస్‌అల్‌ఖైమా నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీలో ఉన్న ప్యాంట్‌ను పరిశీలించి చూడగా అందులో దాచి తీసుకొచ్చిన175 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ రూ.10.82 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. జెడ్డా నుంచి వచ్చిన మరో ప్రయాణికుడిని తనిఖీ చేయగా లో దుస్తుల్లో దాచుకుని తీసుకొచ్చిన 650 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ.39.61 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు



స్వాధీనం చేసుకున్న బంగారం